క్లుప్తంగా

నేడు సోషల్ ఆడిట్

జియ్యమ్మవలస: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సోషల్ ఆడిట్‌పై పబ్లిక్ హియరింగ్ జరగనున్నట్టు ఎంపీడీఓ ఎస్.రమేష్ తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజలు హాజరై తమ సమస్యలు తెలియజేయాలని సూచించారు.

మండల సమావేశం రేపు

గుమ్మలక్ష్మీపురం: మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కుంబురుక దీనమయ్య అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులంతా ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు. సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

అపరాధ రుసుం వసూలుపై దృష్టి

పాలకొండ రూరల్: నిబంధనలు అతిక్రమించిన వాహనదారుల నుంచి పెండింగ్ అపరాధ రుసుం వసూలుపై పోలీసులు గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఏఎస్సై నారాయణరావు ఆధ్వర్యంలో పాలకొండ – శ్రీకాకుళం రహదారిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 21 మంది వాహన చోదకుల నుంచి రూ. 3,400 అపరాధ రుసుం వసూలు చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న చలాన్‌లను చెల్లించేలా అవగాహన కల్పించారు.

రైతుకు ప్రోత్సాహం..

సీతంపేట: మండలంలోని దుగ్గి గ్రామానికి చెందిన ఆరిక రవీంద్ర అనే రైతుకు బెంగుళూరుకు చెందిన జైవిక్ అనే సంస్థ గురువారం అవార్డుతో పాటు రూ. లక్ష నగదు అందజేసి ప్రోత్సహించింది. డిగ్రీ పూర్తి చేసిన రవీంద్ర సేంద్రియ విధానంలో వివిధ రకాల పంటలు పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు.

మానవ సేవకు ముందుకు రావాలి..

- యోగిని చంద్రకాళీ ప్రసాద్ మాతాజీ



యోగినిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

పాలకొండ రూరల్: ప్రతి ఒక్కరూ తనలో అంతర్లీనంగా దాగిఉన్న భగవంతుడ్రి గ్రహించి, మానవసేవకు ముందుకు రావాలని కాళీవన ఆశ్రమ పీఠాధిపతులు యోగిని చంద్రకాళీ ప్రసాద్ మాతాజీ అన్నారు. గడిచిన మూడు రోజులుగా మండలంలోని చిన మంగళాపురంలో కొనసాగుతున్న ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో గురువారం ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ క్షమాగుణం, దానగుణం అలవర్చుకోవాలని సూచించారు. భగవంతుడ్ని చేరేందుకు మానవసేవే మార్గమన్నారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు సామూహిక నగర సంకీర్తన, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, సర్పంచ్ గోగుల కల్యాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సెంట్రల్ డైరెక్టర్ బంకి లక్ష్మణమూర్తి, బి.గణపతిరావు, బంకి సురేష్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన

సాలూరు: ఆర్టీసీకి సంబంధించి పట్టణంలో గురువారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు మంచి స్పందన లభించిందని ఆర్టీసీ డీఎం భాస్కరరెడ్డి తెలిపారు. ప్రధానంగా సాలూరు, పార్వతీపురం మధ్య ఎక్స్‌ప్రెస్ సర్వీసు నడపమని, వయోవృద్ధులకు 25 శాతం రాయితీ అమలు చేయాలని, రామభద్రపురం గుడి వద్ద బస్సులు ఆపాలని, మంచాడవలస, విశ్వనాధపురం, గడివలసల మీదుగా పాచిపెంట – సాలూరు మధ్య బస్సు నడపాలని తదితర అంశాలను ప్రజలు తెలిపారన్నారు. వారి సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు.

పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలి

సాలూరు రూరల్: పిల్లల పట్ల తల్లితండ్రులు బాధ్యతగా ఉండాలని, మాతృభాషను గౌరవించే విధంగా తీర్చిదిద్దాలని అఖిల భారత శిక్షా సంస్థాన్ జాతీయ కార్యదర్శి బ్రహ్మాజీరావు అన్నారు. మండలంలోని మామిడిపల్లి శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

క్షణంలో లైఫ్ సర్టిఫికెట్..

- 'జీవన్ ప్రమాణ్'లో భాగంగా ఇంటి వద్దే లైఫ్ సర్టిఫికెట్లు
- తపాలాశాఖ ఆధ్వర్యంలో సేవలు
- ఆన్‌లైన్ ద్వారా ఖజానా శాఖకు పంపిస్తున్న వైనం



పాలకొండ పోస్టాఫీస్

పాలకొండ రూరల్: విశ్రాంత ఉద్యోగులు తాము జీవించి ఉన్నామనే ధ్రువీకరణ పత్రాన్ని రానున్న ఫిబ్రవరి 28 నాటికి ఖజానా శాఖకు అందించాల్సి ఉంటుంది. గతంలో ఈ తరహా పత్రాలు అందించేందుకు సదరు ఉద్యోగులు వ్యయప్రయాల కోర్చి రోజుల తరబడి తిరిగితే తప్ప ధ్రువపత్రాలు వచ్చేవి కావు. పైగా మళ్లీ వాటిని ఖజానా శాఖకు అందించేందుకు అదనంగా ఒకటి,రెండు రోజుల సమయం పట్టేది. మంచాన పడి కదలలేని స్థితిలో ఉన్నవారి పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉండేది. ఈ క్రమంలో తపాలాశాఖ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విశ్రాంత ఉద్యోగులకు ఇంటివద్దనే డిజిటల్ జీవన ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసేందుకు జీవన్ ప్రమాణ్ పేరుతో సరికొత్త పథకానికి నడుం బిగించింది. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని అన్ని తపాలాకార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాట్లు చేసింది.

డిజిటల్ సేవలు ఇలా...

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ (జీవన్ ప్రమాణ్ పత్రం) అవసరమైన విశ్రాంత ఉద్యోగులు తమ పరిధిలోని తపాలా సిబ్బందికి ముందుగా సమాచారం అందించాలి. విషయం తెలుసుకున్న సదరు సిబ్బంది బ్రాంచ్ పోస్టాఫీస్ అధికారుల ఆదేశాలతో డివైజ్ ద్వారా సంబంధిత విశ్రాంత ఉద్యోగి ఇంటివద్దకు చేరుకుంటారు. ఆధార్ బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు సేకరించి, పూర్తి వివరాలను నమోదు చేస్తారు. నమోదు ప్రక్రియ పూర్తైన కొద్ది క్షణాల్లో సదరు ఉద్యోగి మొబైల్ నంబరు ధ్రువపత్ర ప్రక్రియ పూర్తయినట్లు మెసేజ్ వస్తుంది. దీంతో తపాలా సిబ్బంది సర్టిఫికెట్‌ను అక్కడికక్కడే అందజేసి, ఆ ఉద్యోగికి పింఛన్ అందించే ఖజానా కార్యాలయానికి ఆన్‌లైన్ ద్వారా ఈ ధ్రువపత్రాలు పంపుతారు.

కావాల్సిన పత్రాలు..

విశ్రాంత ఉద్యోగి పింఛన్ ఐడీ కార్డు, ఆధార్ కార్డు, పింఛన్ చెల్లింపు పత్రాలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఉపయోగంలో ఉన్న ఫోన్ నంబర్, ఖజానా కార్యాలయం పూర్తి చిరునామా తప్పక ఉండాలి. దీంతో పాటు సేవల ఫీజు రూ.70 చెల్లించాల్సి ఉంటుంది.

వేలాది మందికి ఊరట..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, ఈపీఎఫ్ ద్వారా పింఛన్ పొందుతున్న వారి కోసం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను తపాలాశాఖ అందుబాటులోకి తెచ్చింది. సంబంధిత ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేయడమే కాకుండా ఆన్‌లైన్‌లో ఖజానా కార్యాలయానికి చేర్చుతుంది. దీంతో విశ్రాంత ఉద్యోగులు వీటి కోసం ఇతర కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరమే ఉండదు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఖజానా కార్యాలయాల పరిధిలో ఉన్న సుమారు ఏడు వేల మంది విశ్రాంత ఉద్యోగులకు ఈ విధానం ఊరట నిస్తుందని, సదరు ఉద్యోగులు, ట్రెజరీ, తపాల అధికారులు చెబుతున్నారు.

ఎంతో మేలు



లైఫ్ సర్టిఫికెట్ పొందేందుకు గతంలో తీవ్ర ఇబ్బందులు పడే వారం. ముఖ్యంగా వృద్ధులు, ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడేవారి సమస్యలు చెప్పలేని విధంగా ఉండేవి. ప్రస్తుతం పోస్టల్ శాఖ వారు ఇంటివద్దనే జీవన ధ్రువపత్రాలను అందించడం మంచి పరిణామం. – కె.చౌదరినాయుడు, విశ్రాంత ఉద్యోగుల ఆసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, పార్వతీపురం మన్యం

సద్వినియోగం చేసుకోండి



విశ్రాంత ఉద్యోగులు ఏటా సమర్పించాల్సి జీవన ధ్రువపత్రాన్ని తపాలా శాఖ ఇంటివద్దనే అందిస్తోంది. వయోభారంతో వ్యయప్రయాసల కోర్చి పలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా తపాలా శాఖ రిటైర్డ్ ఉద్యోగుల కోసం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. డిజిటల్ సర్టిఫికెట్ అవసరమైన వారు తమ పరిధిలోని పోస్ట్‌మన్‌కు సమాచారం అందిస్తే చాలు. మా సిబ్బందికి ఇంటివద్దనే ధ్రువపత్రాలను సిద్ధం చేసి అందజేస్తారు.
– మంతిన శంకరరావు, పోస్టుమాస్టర్, పాలకొండ బ్రాంచ్



నగర పంచాయతీలో విశ్రాంత ఉద్యోగుల ఇళ్ల వద్ద సేవలు అందిస్తున్న తపాలా శాఖ సిబ్బంది

తాడికొండలో స్వామిత్ర యోజన సర్వే



స్వామిత్ర యోజన సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ గ్రామంలో గురువారం స్వామిత్ర(సర్వే ఆఫ్ విలేజెస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) యోజన సర్వేను పంచాయతీ కార్యదర్శి పాలక మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సరిహద్దులను గుర్తించారు. ఆస్తి తగాదాలను సాధ్యమైనంత వరకు తగ్గించడం, ఆస్తులు, ఆస్తి పన్నుల మదింపు, గ్రామ స్థాయిలో సమగ్ర విధానాల నిర్ణయాలకు దోహదపడేందుకు కేంద్ర ప్రభుత్వం స్వామిత్ర యోజన సర్వేకు ఆదేశించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అడ్డాకుల చిన్నారావు తదితరులతో పాటు వీఆర్వో పుష్పలత, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో రెండు శస్త్రచికిత్సలు



కమలమ్మకు ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో గురువారం ఇద్దరికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో లక్షలాది రూపాయలతో చేసే ఆపరేషన్లను ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా చేశారు. కొత్తూరు మండలం కలిగాం గ్రామానికి చెందిన కమలమ్మ ఇన్సేషినల్ హెర్నియాతో.. భామిని మండలం వడ్డంగికి చెందిన జ్యోతి ఉంబిలికల్ హెర్నియాతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరారు. వీరికి ఆస్పత్రి సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు పర్యవేక్షణలో సివిల్ సర్జన్ డాక్టర్ డీవీ శ్రీనివాస్, అసిస్టెంట్ సర్జన్ జయకృష్ణ, మత్తు డాక్టర్ రత్నాకర్ ఆపరేషన్లు నిర్వహించారు. ప్రస్తుతం వీరు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆస్పత్రిలో స్పెషలిస్టు వైద్యులను నియమించడంతో పాటు అధునాతన పరికరాలు సమకూర్చారు. దీంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి.

డయేరియా నియంత్రణకు చర్యలు చేపట్టాలి



శిబిరంలో రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని గాంధీనగర్, శివ్వాల వీధి, గౌడు వీధిలో ప్రబలిన డయేరియా నియంత్రణకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన డయేరియా ప్రబలిన వీధుల్లో అధికారులు చేపట్టిన నియంత్రణ చర్యలను ఆ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బందితో మాట్లాడుతూ డయేరియా బాధితుల యొక్క వివరాలు, అందించిన, అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా ప్రబలిన నేపథ్యంలో ప్రజాప్రతినిధులు స్పందించి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి, అన్ని వీధులలోనూ పారిశుధ్య పనులు యుద్ధ ప్రాతిపదికన చేయించి, వాటర్ ట్యాంకుల్లోను శుభ్రపర్చి క్లోరినేషన్ చేసి పైప్‌లైన్ల లీకేజీ లేకుండా చూడాలని కోరారు. కనీసం వారం పాటు వైద్య శిబిరాలు కొనసాగించాలని కోరారు.

సుభాష్ చంద్రబోస్ భరతమాత ముద్దుబిడ్డ



గ్రంథాలయంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న అధికారులు



గుమ్మలక్ష్మీపురం: నేతాజీ జీవిత విశేషాలను వివరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం

పాలకొండ రూరల్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ భరతమాత ముద్దు బిడ్డ అని స్థానిక శాఖా గ్రంథాలయ ఇన్‌చార్జ్ అధికారి బి.గణేష్‌బాబు అన్నారు. గురువారం నేతాజీ జయంతి కార్యక్రమాన్ని గ్రంథాలయంలో ఘనంగా చేపట్టారు. స్వాతంత్ర సాధనలో భాగంగా బోష్ చూపిన తెగువ అన్నివర్గాల్లో స్ఫూర్తిని రగిల్చిందన్నారు. ఈ సందర్భంగా బోష్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పాఠకులు, గ్రంథాలయ సహాయకురాలు నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వాతంత్ర్య పోరాట యోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముందుగా చంద్రబోస్ చిత్రపటానికి అధ్యాపకులు విద్యార్థులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, అధ్యాపకులు శ్రీవాణి, వి.కల్పన, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



కొమరాడ: జూనియర్ కళాశాలలో బోస్ చిత్రపటం వద్ద నివాళులు

ఘనంగా నేతాజీ సుభాష్ జయంతి

కొమరాడ: స్థానిక జూనియర్ కళాశాలలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకుడు కొల్లు సాంబమూర్తి బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం..



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు

వీరఘట్టం: రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులనాయుడు కోరారు. ఈ మేరకు మండలంలో గురువారం విస్తృతంగా ప్రచారం చేపట్టారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో కూడా ప్రచారం చేశారు. ఆయనతో పాటు పీఆర్‌టీయూ నాయకులు కె.పోలినాయుడు, గర్భాన శ్రీను, బంకురు అప్పలనాయుడు, హరిశ్చంద్రుడు, బైరి అప్పారావు, వాలేటి తవిటినాయుడు, అమరాపు సూర్యనారాయణ, దిబ్బ సూర్యచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కురుపాం ఎస్‌ఐ పి.నారాయణరావు అన్నారు. గురువారం ఆయన కురుపాంలో తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్, లైసెన్స్ తదితర పత్రాలు లేని వాహదారులకు అపరాధ రుసుం వేశారు. అలాగే వారపు సంత ప్రదేశం వద్ద గిరిజనులకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకొండ: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ డీఈఈ టీజీకే మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్దలి, వీపీ రాజీపేట, బాసూరు, ఎల్ఎల్‌పురం, కోటిపల్లి చిన్న కోటిపల్లి, తదితర గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.

- గ్రంథాలపై ప్రచారం..



భామిని మండలంలోని బత్తిలి, కాట్రగడ-బి, నులకజోడు, బురుజోల గ్రామాలలో త్రైత సిద్ధాంత ప్రబోధ కమిటీ సభ్యులు గురువారం ఇంటింటికీ వెళ్ల ప్రచారం నిర్వహించి, ప్రబోధ గ్రంథాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. - భామిని

పుష్పాలంకరణలో లక్ష్మీనృసింహస్వామి



పుష్పాలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి గురువారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు ముడుపుల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో స్వామివారికి అర్చకులతో ప్రత్యేక అలంకరణ చేసారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న కేవీకే కోఆర్డినేటర్ ధృవ

గరుగుబిల్లి: అపరాల పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.ధృవ రైతులకు సూచించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, రస్తాకుంటుభాయి ఆధ్వర్యంలో రైతులకు గురువారం క్షేత్ర సందర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. పూత, కాయదశలో ఉన్న మినప పంట, ప్రస్తుతం బూడిద తెగులు ఆశించింది. దీని నివారణకు మైక్లో బ్యూటనిల్ 150 గ్రాములు ఎకరాకు 200 ఎకరాల నీటిలో పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరుతడి పంటలను పండించేటప్పుడు పంటలను ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సస్యపోషణ శాస్త్రవేత్త డాక్టర్ శ్రవంతి, విస్తరణ విభాగం శాస్త్రవేత్త అనంత విహారి, రైతులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాలను నివారించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీఓ సిబ్బంది, యువత

పాలకొండ: రహదారి ప్రమాదాలు నివారించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్ అన్నారు. పట్టణంలో గురువారం రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువతకు రహదారి నిబంధనలు వివరించారు. కోటదర్గమ్మ ఆలయం నుంచి ఏలాం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, ప్లకార్డులను ప్రదర్శించారు.



గుమ్మలక్ష్మీపురం: పశువైద్య శిబిరంలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది



సీతంపేట: పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి శంకరరావు, సిబ్బంది

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- పశువైద్యాధికారి శంకరరావు



భామిని: పాడి అభివృద్ధిపై సూచనలు చేస్తున్న వైద్యాధికారులు



పాలకొండ: పశువులకు చికిత్స చేస్తున్న సిబ్బంది

సీతంపేట: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి ఆర్.శంకరరావు అన్నారు. మండలంలోని కోసంగి, జిల్లేడుపాడు, తదితర గ్రామాల్లో గురువారం పశు వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శిబిరాల్లో మూగజీవాలు, పశువులను పరీక్షించి అవసరమైన మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనసరలో..

భామిని: మండలంలోని ఘనసరలో పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులు, మూగజీవాలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు రాధారాణి, శ్రీనివాస్, సంతోష్‌కుమార్, తదితరులు పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి కిల్లారి ఫాల్గుణరావు, మాజీ ఎంపీపీ భూపతి ఆనందరావు చేతుల మీదుగా రైతులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో వీఏఏలు, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

అంపిలిలో..

పాలకొండ: మండలంలోని అంపిలిలో జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి శివ్వాల మన్మధరావు ఆధ్వర్యంలో పశు వైద్య సిబ్బంది పశువులకు చికిత్సలు నిర్వహించారు. ఎ.డి మాణిక్యాలరావు, పశు వైద్యాధికారి సిద్ధార్థ్ మూగజీవాలకు వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా మన్మధరావు మాట్లాడుతూ.. రైతులు పాడి సంపదను కాపాడుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.